ఇంటి ముంగిటకే రేషన్

రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పనిలేదు. కిలోమీటర్ల దూరం నడవాల్సిన అవసరం అంతకంటే లేదు. ఇప్పుడు ఇంటి వద్దకే రేషన్ వస్తోంది. గతంలో బియ్యం తీసుకోవాలంటే రోజుల తరబడి వేచి చూడాలి. సరుకుల కోసం వెళ్తే డీలర్ అందుబాటులో ఉండేవాడు కాదు. డీలర్ ఉంటే సర్వర్ పని చేయదు. రేషన్ కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటి వద్దకే పేదలకు రేషన్ సరుకులు అందిస్తుండడంపై సర్వత్రా అన్ని వర్గాల ప్రజల నుంచి ఆనందం వ్యక్తం అవుతోంది.

- నియోజకవర్గంలో కార్డుదారులు 75,342
- రేషన్ సరుకులు ఇంటింటి రవాణాకు 45 వాహనాలు
- నిత్యం పర్యవేక్షిస్తున్న అధికారులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పాలసముద్రం దళితవాడలో రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్



గతంలో రేషన్ షాపు వద్ద సరుకుల కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు (ఫైల్)

పాలసముద్రం: రాష్ట్రవ్యాప్తంగా 2019 తరువాత రేషన్ సరుకుల కోసం, డీలర్ కోసం రేషన్ దుకాణం వద్ద ఎదురు చూసే రోజులు పోయి.. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి రేషన్ అందించే పాలన అందుబాటులోకి వచ్చింది. రేషన్ పంపిణీ కోసం ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లను నియమించింది. వారికి ప్రభుత్వమే సబ్సిడీపై వాహనాలు అందించి వారికి కూడా జీవనోపాధి కల్పించింది. గతంలో మాదిరి రేషన్ కోసం దుకాణం వద్ద రోజుల తరబడి వేచి చూసే పరిస్థితి లేదు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు ఎండీయూ ఆపరేటర్లు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తున్నారు.

పోర్టబులిటీ ద్వారా సరుకులు..

గంగాధరనెల్లూరు నియోజకర్గంలో 79,352 రేషన్‌కార్డులు ఉండగా వీరికి 48 వాహనాల ద్వారా 48 మంది ఎండీయూ ఆపరేటర్లు ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలిగిపోయాయి. తూకాల్లో మోసానికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. జీపీఎస్, రైస్‌కార్డు మ్యాపింగ్ ప్రక్రియ చేపటి ప్రజలకు సరుకులు అందిస్తున్నారు. జీపీఎస్ మ్యాపింగ్‌తో లబ్ధిదారులు ఏ రేషన్ షాపు పరిధిలో ఉన్నా నివసించే ప్రాంతంలోని చౌకదుకాణం నుంచే పోర్టబులిటీ ద్వారా రేషన్ సరుకులు తీసుకోవచ్చు. వేరే ప్రాంతానికి వెళ్లే ఆ ప్రాంత వలంటీర్‌కు సమాచారం ఇచ్చి జీపీఎస్ మ్యాపింగ్ చేయించుకుంటే నెల ఆరంభంలోనే ఒకటో తేదీ నుంచి 17వ తేదీలోగా సరుకులు అందించనున్నారు. ఏ రోజు ఏ వీధిలో ఎవరి ఇళ్ల వద్దకు ఎన్ని గంటలకు రేషన్ డెలివరీ వాహనం వస్తుందో ముందస్తు సమాచారం ఇస్తున్నారు. కుటుంబంలో ఒకరు ఉంటే చాలు సరుకులు అందజేస్తున్నారు.

మండలం	రేషన్ కార్డులు	వాహనాలు
గంగాధరనెల్లూరు	20099	11
రంగరాజుపురం	11632	7
కార్వేటినగరం	13647	9
వెదురుకుప్పం	14677	9
పెనుమూరు	12735	8
పాలసముద్రం	6562	4

ఇంటి వద్దే ఇస్తున్నారు..



మాది వెంగళరాజుకుప్పం దళితవాడ. గతంలో మేము సుమారు ఒక కిలోమీటరు దూరం వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం మా ఊరిలో మా ఇంటి వద్దకే వ్యానులో వచ్చి రేషన్ బియ్యం, సరుకులు ఇస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి సౌకర్యం కల్పించడంతో మాలాంటి వారికి ఎంతో మేలు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– మీనా, వీఆర్ కుప్పం

సకాలంలో అందిస్తున్నాం..



అధికారుల ఆదేశాల మేరకు సకాలంలో ప్రజలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్నాం. మాకు అడాప్ట్ చేసిన గ్రామాలకు ఎప్పుడు వచ్చేది ముందుగానే తెలియజేస్తాం. దీంతో వాహనం వచ్చిందని లబ్ధిదారులు వచ్చి సరుకులు తీసుకెళ్తారు. మా ఆపరేటర్లకు జీవనోపాధి కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఆర్.రవి, ఎండీయూ ఆపరేటర్

పారదర్శకతకు పెద్దపీట..



పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తూకాల్లో మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటా ద్వారా లబ్ధిదారుని ఎదురుగా సరుకులు తూకం వేసి పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. లబ్ధిదారులకు ఇబ్బందులు పడకుండా వాహనాలను ఏర్పాటు చేసి గడప గడపకు నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు అందజేస్తున్నాం. సకాలంలో నాణ్యమైన బియ్యం అందజేస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. – మధుబాబు, డిప్యూటీ తహసీల్దార్

అర్హులకు నేరుగా లబ్ధి



ప్రభుత్వం తెల్లకార్డులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను అర్హులకు నేరుగా అందించాలి. సకాలంలో డీడీలు కట్టి, సరుకులు పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చాం. సరుకులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా ? లేదా ? అని వీఆర్‌ఓలు పర్యవేక్షిస్తున్నారు. ఒకటి నుంచి 17వ తేదీలోపు వారికి కేటాయించిన కుటుంబాలకు సరుకులు అందించాలి.

– సుబ్బులక్ష్మమ్మ, తహసీల్దార్, పాలసముద్రం

క్లుప్తంగా

స్పందన వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం : స్పందనలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని మండల తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి 11 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 03, డీకేటీ పట్టా కేటాయించాలని 02, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 02, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01, ఇంటి స్థలం ఇప్పించాలని 03, వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనకు వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి



ఓంను కొవ్వొత్తులతో అలంకరిస్తున్న విద్యార్థులు

కార్వేటినగరం: విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని మంచి క్రమశిక్షణతో ముందుకెళ్లాలని ఈటూ ఓపెన్ సాఫ్ట్‌వేర్ సీనియర్ డైరెక్టర్ శంకర్ అన్నారు. సోమవారం లక్ష్మీనరసింహ విద్యాసంస్థల జూనియర్ కళాశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసంలో క్రమశిక్షణతో పాటు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారని తెలిపారు. అనంతరం కళాశాలలో ఉప్పురాళ్లతో పవిత్రమైన ఓంను ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలిగించి సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ధనుంజయరెడ్డి, దిలీప్‌కుమార్, వెంకటేష్, పురుషోత్తం, కళాశాల ప్రిన్సిపల్ కిషోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కళ్లను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. చెన్నై శంకర్ నేత్రాలయం వైద్యాధికారులచే నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 41 మంది పాల్గొన్నారు. అందులో 26 మందిని కంటిపొర ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వారికి ఆపరేషన్ పూర్తయిన తరువాత స్వగ్రామం చేర్చే వరకు ఆస్పత్రి వారే ఖర్చులు భరించుకుంటారని తెలిపారు. నెలకు ఒకసారి ఇలాంటి ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



సరస్వతి పూజ చేస్తున్న టీచర్లు, విద్యార్థులు

పాలసముద్రం : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రఘు తెలిపారు. సోమవారం బలిజకండ్రిగ హైస్కూల్‌లో అప్‌గ్రేడ్ చేసిన కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం రఘు మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల కోసం మన స్కూల్‌లోనే ఇంటర్ చదివే అవకాశం కల్పించిందన్నారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని తెలిపారు.

దశకంఠుని వాహనం వితరణ



రావణాసుర వాహనాన్ని అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి హైదరాబాద్‌కు చెందిన జ్యోతి, శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి చెందిన ధర్మయ్య కలిసి రావణాసుర వాహనాన్ని వితరణ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో దీనిని అందజేశారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యరాజు

పెనుమూరు(కార్వేటినగరం): విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు అన్నారు. సోమవారం ఇంటర్మీడియట్ సీనియర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య ప్రభుత్వ కళాశాల్లోనే సాధ్యమన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. అదేవిధంగా పేద పిల్లలకు ఉన్నత చదువులు అందించేందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ కళాశాలల రూపురేఖలను మార్చసిందన్నారు. విద్యార్థులకు అధునాతనమైన మరుగుదొడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు, కంప్యూటర్ ల్యాబ్‌లు వంటి ఎన్నో వసతులు ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లోనే మంచి విద్యాబోధనలు ఉంటాయని సూచించారు. అనంతరం క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే అండర్ బ్రిడ్జిల నిర్మాణం



ఉత్తరపుకండ్రిగ రైల్వే అండర్ బ్రిడ్జి



ఉత్తరపుకండ్రిగ రైల్వేఅండర్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో ఎంపీపీ మునివేలు

పుత్తూరు: రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణే ధ్యేయంగా అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు జరిగాయని ఎంపీపీ మునివేలు తెలిపారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా పుత్తూరు మండలం ఉత్తరపుకండ్రిగ అండర్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1500 రైల్వే అండర్ బ్రిడ్జిలు, 550 నూతన రైల్వేస్టేషన్లను ప్రధాని ప్రారంభించినట్లు తెలిపారు. పుత్తూరు మండలంలో ఉత్తరపుకండ్రిగ, నందిమంగళం, ఈశ్వరాపురం, కేఎం అగ్రహారం, తడుకు గ్రామాల వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైల్వే సీనియర్ సెక్షన్ ఆఫీసర్ బాలాజీ, వైస్ ఎంపీపీలు విమల, మునస్వామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్‌మెంబర్లు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలు

పుత్తూరు: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ మునివేలు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు తాగునీటి సరఫరాపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. అలాగే త్వరలో జరగనున్న పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించేందుకు తగిన ఏర్పాటు చేయాలని ఎంఈఓకు సూచించారు. అలాగే పరీక్షల సమయంలో పరీక్ష కేంద్రాల్లో తగిన మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. రామసముద్రంలో అవసరమైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు. మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ వాణి, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో సేవా కార్యక్రమాలు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్

నగరి : సామాజిక స్పృహ ప్రతి ఒక్కరికీ అవసరమని లయన్స్ క్లబ్స్ 317ఈ జిల్లా గవర్నర్ డా.రామరాజ్ అన్నారు. నగరి లయన్స్ క్లబ్, పుత్తూరు లయన్స్ క్లబ్ సంయుక్తంగా నగరిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎక్కడో అమెరికాలో స్థాపించబడిన లయన్స్‌క్లబ్స్ స్వచ్ఛంద సంస్థ నేడు 55 దేశాలలో విస్తరించిందన్నారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. విద్యార్థులకు చెప్పులు వితరణగా అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. నగరి, పుత్తూరు లయన్స్‌క్లబ్ వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరేష్, ఏడీఎస్ శ్రీనివాసులు, రీజనల్ చైర్‌పర్సన్ మోహన్ రెడ్డి, డీసీ ప్రతాప్‌యాదవ్, డీసీ నాగరాజు, నగరి, పుత్తూరు లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేబ్రిడ్జిలకు పూర్వ వైభవం



పెనుమూరు క్రాస్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు, బీజేపీ నేతలు

పెనుమూరు(కార్వేటినగరం): భారతీయ జనతా పార్టీతోనే రైల్వేబ్రిడ్జిలు, రోడ్లకు పూర్వ వైభవం వచ్చిందని మండల బీజేపీ అధ్యక్షుడు గుత్తా వాసుదేవనాయుడు అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పెనుమూరు క్రాస్ వద్ద రూ.3 కోట్లతో నిర్మాణం చేసిన అండర్ బ్రిడ్జిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలో రూ.41 కోట్లు వెచ్చించి 554 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, 1500 రోడ్లకు ఓవర్ బ్రిడ్జిలను నిర్మించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే శాఖను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అనంతరం ఆయన అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి జీకే చౌదరి, పూతలపట్టు మండల అధ్యక్షుడు నరసింహులునాయుడు, రైల్వే అధికారులు మధుసూదనయ్య, వేణుమాధవ్, ఉదయరామసింగ్, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయానందరెడ్డికి సత్కారం



విజయానందరెడ్డిని సత్కరిస్తున్న మనోహర్ రెడ్డి, నాయకులు

గంగాధర నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షుడు, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానంద రెడ్డిని సోమవారం జీడీనెల్లూరు నూతన వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రెటరీ ఎస్.మనోహర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తనను జనరల్ సెక్రటరీగా నియమించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పూర్ణచంద్ర రెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఒత్తిడిని జయించండి



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్‌రాజు

పుత్తూరు: ఫిజియోథెరపీ చేసుకోవడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని నిజాం ఆస్పత్రి ప్రతినిధి రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో నిజాం ఆస్పత్రి ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పని భారంతో బాధపడే వారు, మానసిక ఒత్తిళ్లకు గురవుతుంటారని, ఇలాంటి వారికి ఫిజియోథెరపీ ఎంతో ఉపశమనం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రాజు, బాలసుబ్రమణ్యం, హెచ్‌ఎంలు, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

గుత్తహక్కుల వేలంతో రూ.73.06 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్

నగరి : గుత్త హక్కుల వేలం ద్వారా మున్సిపాలిటీకి రూ.73.06 లక్షల ఆదాయం చేకూరింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మా ర్చి 31 వరకు మున్సిపల్ వనరులైన వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు, ట్యాక్సీ ఆటోస్టాండు గుత్తహక్కులు కేటాయించడానికి సోమవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ వే లంలో హెచ్చుపాటదారులకు అధికారులు ఏడాది పాటు గుత్తహక్కులు వ సూలు చేసుకునే హక్కును క ల్పించారు. తద్వారా మున్సిపాలిటీకి రూ.73.06 లక్షలు ఆదాయం చేకూరినట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు.

శాస్త్రోక్తంగా మహానంది విగ్రహ ప్రతిష్ట



త్రయంబకేశ్వరాలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన నంది విగ్రహం

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో గల రాజగోపురం ఎదుట స్థానిక విశ్రాంత బ్యాంక్ మేనేజర్ బొప్పన మోహనమురళితో నిర్మించిన మహానంది విగ్రహాన్ని సోమవారం ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ముందుగా వినాయక పూజతో ప్రారంభించి, ప్రత్యేక హోమపూజలు చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అనంతరం నందీశ్వరునికి ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు మహానందిని దర్శించుకుని ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అర్చకులు రాజేంద్రప్రసాద్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సీఎం సభకు కదిలిన గ్రామాలు



బస్సులో బయలుదేరుతున్న రైతులు, ప్రజలు

శ్రీరంగరాజపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం పర్యటన సందర్భంగా భారీఎత్తున తరలివెళ్లారు. మండల రైతువిభాగం అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తండోపతండాలుగా స్వచ్ఛందంగా వృద్ధులు, దివ్యాంగులు, యువకులు, అక్కచెల్లమ్మలు వాహనాల్లో వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు తాండవమాడిన కుప్పానికి కృష్ణ జలాలను తెస్తామన్న నాడు ఇచ్చిన మాటను నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృష్ణా జలాలను విడుదల చేసి నిలబెట్టుకున్నారని తెలిపారు. తద్వారా రైతుల కల సహకారం అయిందన్నారు. కృష్ణ జలాల రాకతో కుప్పం పరవశించిపోయిందన్నారు. 2024 ఎన్నికల్లో అఖండ మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తామన్నారు. అందుకోసమే తాము కుప్పంలో నిర్వహిస్తున్న సమావేశానికి స్వచ్ఛందంగా బయలుదేరుతున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటామని తెలిపారు.

జగనన్న వెంటే మా పయనం



కుప్పం బయలుదేరుతున్న పెనుమూరు నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సమావేశానికి జిల్లా కోఆప్షన్ మెంబర్ అమీన్ ఆధ్వర్యంలో జనం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన బస్సును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అందిస్తూ జనం గుండెల్లో కొలువైన జగనన్న వెంటే అన్ని సామాజిక వర్గాలు ఉన్నాయని, టీడీపీ, జనసేనలు కలసి వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. గతంలో ముస్లిం మైనారిటీలను పట్టించుకున్న పార్టీలు లేవని, నేడు ముస్లిం మైనారిటీల అభివృద్ధే లక్ష్యంగా పాలన అందిస్తున్న జగనన్న రుణం తీర్చుకుంటారని ముస్లింలు చెప్పారు. అనంతరం జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, లోకేష్‌రెడ్డి, యతీశ్వర్ నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం నుంచి..



కార్వేటినగరం: సీఎం సభకు వెళ్తున్న నాయకులు

కార్వేటినగరం: కుప్పానికి కృష్ణా జలాలను విడుదల చేసేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బహిరంగ సభలో పాల్గొనేందుకు సోమవారం మండల పరిధిలోని కత్తెరపల్లి నుంచి అధిక సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పద్మనాభరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శోభన్‌బాబు, అర్జునయ్య, ధర్మయ్య, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



పాలసముద్రం నుంచి సీఎం సభకు బయలుదేరిన పార్టీ శ్రేణులు

పాలసముద్రం : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసీయాదవ్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విభేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు నాలుగు బస్సుల్లో బయలుదేరారు. కార్యక్రమంలో షణ్ముగరెడ్డి, రవిరెడ్డి, కుట్టి, మాజీ సర్పంచ్ విజయన్, కుప్పారెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్ల వద్దే సందేహాల నివృత్తి



విద్యార్థులకు ఇంటి వద్దే సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు

నగరి : ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక ఆసక్తి చూపుతోంది. సోమవారం ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నైట్ విజన్‌లో భాగంగా 10వ తరగతి చదివే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు ఇంటి వద్ద చదువుతున్నారో లేదో ఆరాతీశారు. తల్లిదండ్రులకు విద్యార్థి స్థాయిని వివరించి వారిని ప్రతిరోజు చదివించాలని సూచించారు. పాఠాల్లో సందేహాలు ఉంటే వాటిని తెలుసుకుని పరిష్కరిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిరత్నం, ఆనంద్ పాల్గొన్నారు.